

# వికారచేష్టలు

"కృష్ణాజీ"

మా ఊరువిడిచి మెడ్రాసు వెళ్లటానికి నాకదే మొదటిసారి. తల్లి తండ్రులచాటున పెరగటంవల్ల యీ ప్రపంచపు అన్యాయాలు, కృత్రిమ చర్యలు, టక్కరితనం వగైరా నేనేమి ఎరుగను. ఇంటర్మీడియెటు ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుణ్ణి కావడంతోనే ప్రెసిడెన్సీకాలేజీలో ఆనర్సులో చేరమని నా మేష్టర్లు సలహా యిచ్చారు. "పట్నంలో దుస్సాంగత్యాలకు, దురభ్యాసాలకు చాల అవకాశా లున్నాయి. అట్లాంటి వాటిలో తగులోక్క, ముక్కుకి సూటిగా నడుచుకో; మేము నీదగ్గర లేమని బెంగపెట్టుకోవద్దు. అన్నిటికీ శీతారామయ్యగారే ఉన్నారు. డబ్బు యెప్పుడు అవసరమైతే అప్పుడు వ్రాయి; వ్రాసిన తక్షణం పంపిస్తాను"- ఇట్లా ప్రేమ పూర్వకంగా నా తండ్రిగారు నన్ను సాగనంపారు. నేను ప్రయోజకుణ్ణయి, మా వంశాన్ని ఉద్ధరిస్తానని నామీదెన్నో ఆశలు పెట్టుకున్న తల్లి తండ్రులకు నా విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలనే దృఢసంకల్పంలో, రాత్రి పదకొండు గంటలకు రైలెక్కాను.

మా నాన్నకి బాల్యస్నేహితుడైన శీతారామయ్యగారు తిరువళ్ళిక్కేణిలో ఒకయిల్లు అద్దెకు పుచ్చుకుని అందులో కాపురంచేస్తున్నారు. నేనుకూడా ఆయింట్లో ప్రవేశించాను. ఆ యింటి క్రిందభాగంలోని గదిలో వుంటూ, దగ్గరవున్న హోటల్లో దేవతార్చన చేస్తూండేవాణ్ణి. పాపం శీతారామయ్యగారికి క్షణం తీరుబడి వుండేదికాదు; ఆయన చాల కష్టజీవి అక్కౌంటెంటు ఆఫీసులో

గుమస్తాగా పనిచేస్తున్నాడు. ప్రొద్దున పది గంటలకు ఆఫీసుకి వెళ్లాడంటే రాత్రి ఏడుగంటలదాకా తిరిగి యింటికి రాడు. అప్పుడు అలసి సొలసివచ్చి నాలుగు మెతుకులుతిని మళ్లీ ఆ దిక్కుమాలిన కాగితాలు రాత్రి పది గంటలదాకా చూసి, కడుపులో కాళ్ళుపెట్టుకుని నిద్ర పోయేవాడు. అవీ ఆయన ప్రతి నిత్యం చేసే పనులు. నేను అద్దె యివ్వడానికి వెళ్ళినప్పుడు మాత్రం ఆయన కనబడేవాడు. నే నాయింట్లో ప్రవేశించిన తర్వాత శీతారామయ్యాగారు సినిమాకుగాని, బీచికిగాని వెళ్లి నపాపాన పోలేదు. ఆఖరుకి భార్యతో కులాసాగా కబుర్లు చెప్పగాకూడా చూడలేదు. ఆయనకి యింట్లో పెళ్ళా మున్నదనిగాని, సరససల్లాపా లాడాలనే స్మారకం గాని వున్నట్లు కనబడదు. పైగా రెండోభార్య- మొదటిపెళ్లాం బ్రతికే వున్నదిట. అయితే ఆవిడ భర్తతో కాపురం చెయ్యడాని కిష్టపడలేదుట. దాని కేవో దుర్భేద్యమైన కారణా లున్నాయి. శీతారామయ్యగారు రెండోపెళ్లి చేసుకుంటున్నాడని విని "నన్ను సుఖపెట్టి యేడ్చాడు, యిక దాన్ని సుఖపెడతాడు" అని అందిట. ఈ సంగతి యెంతవరకు నిజమో నేను చెప్పలేను. ఈ గుమాస్తాగిరీలు 'అస్సినైన్' (ఖరము మీదనుంచి వచ్చిన విశేషణము) 'పేమెన్సు'న్న అరవలకు చెల్లుగాని, సుఖమెరిగిన ఆంధ్రులు చెయ్యలేరేమో!

ఆయన భార్య- శ్రీదేవిని సంపూర్ణంగా వర్ణించాలంటె ఒక పెద్ద గ్రంథ మవుతుంది. అందుకని పాఠకుల కంత శ్రమ కల్గించకుండా యేదో క్లుప్తంగా పోనిస్తాను. శ్రీదేవి పిడిరాయి లాంటిది. మనం పకృతం కాలేజీల్లోను, సామాన్యంగా వీధుల్లోను చూస్తూన్న ఎండుకుపోయిన రొమ్ములున్న వాళ్లమాదిరి కాకుండా, శ్రీదేవి జబ్బపుష్టి కలిగిన మనిషి. నాలాంటి వాళ్లను ముగ్గుర్ని సునాయాసంగా ఎత్తికుదరోవెయ్య గలదను కొంటాను- అయితే కొంప ముంచి, అంతపని చెయ్యదులెండి! శ్రీదేవి ముఖంమీద రెండే రెండు మచ్చ లున్నయి; బుగ్గమీద ఒకటి, నుదుటి మీద యింకొకటి. చంద్రుడు గురుపత్నియైన తారతో సంగమం చెయ్యబట్టే కళంకం తెచ్చుకున్నాడని పెద్దల అభిప్రాయం. ఆ కళంకం ఉండబట్టే అంత చల్లదనా న్నిస్తున్నాడని కొందరు శాస్త్రజ్ఞులంటారు. అదే సూత్రాన్ని అనుసరించి మచ్చ లుండటం వల్ల శ్రీదేవి అందం ద్విగుణీకృత మౌతోందని నేననుకుంటాను. కళంకరహితమైన వాటికంటె కొద్దో గొప్పో మచ్చలున్నవి వింత అందాన్నికలిగి ఉంటాయి. అందుచేతనే నిష్కళంకసౌందర్యవతుల అందం రాణించదని 'చలం' గారు సెలవిచ్చారు. ఈ అభిప్రాయాలకి ఆధారం లేకపోలేదు. ఇంత చర్చ చేసిందెందుకంటే, ఆ మచ్చ లుండటం వల్ల శ్రీదేవి నా కంటికి యింత సొగసుగా కనబడుతోందని చెప్పడానికే! ఆ అమ్మాయి జబర్దస్తీగా నడిచిందంటే భూమి కంపిస్తుంది; గాజులు గలగల చప్పుడౌతాయి. శ్రీదేవికి గజ్జెలగుఱ్ఱం అని పేరు పెట్టాను. మంచి నెరజాణ, పైకి బింకంగా, గంభీరంగాఉన్నా ఆ అమ్మాయిది అతి కోమలహృదయ మని తర్వాత కనిపెట్టాను. అయితే ఆ అమ్మాయి చాల విచిత్రమైన మనిషి!

అమ్మాయి అంటున్నావు, ఏమిటయ్యోవ్ అనచ్చు మీరు-పట్టుమని యిరవై ఏళ్ళన్నా లేని పిల్లని ఏమనాలి? మన మేదన్నా మాటన్నామంటే సజావుగా వుండాలి. చిన్న వాళ్లని ముసలివాళ్ళుగా సంభోధించ కూడదనటానికే నేను పడే యీ శ్రమంతా.

౨

ఆనాడు కృష్ణాష్టమి. గదిలో పడుకుని 'భారతి' చదువుతూంటె కాస్త కునుకుపట్టింది.

"రావుగా రున్నారా?"

"ఏమో."

"ఈ యింట్లోనే వుంటున్నారు కదండీ."

"అవును."

ఈ ఉత్తరం ఆయన కిస్తారా?"

"నే నివ్వను- నాకు తెలియదు."

ఇంతలో నేను బయటకొచ్చాను; నన్ను చూసి తపాలాబంట్రోతు

బిత్తర పోయినాడు; శ్రీదేవి మంద హాసం చేసి తలవంచుకుంది. నేను ఉత్తరం తీసుకుని,

"శ్రీదేవిగారు! నేను కాస్త కన్ను మూస్తే తపాలాబంట్రోతు దగ్గర నుంచి, ఉత్తరం తీసుకోకూడదు టండీ! మీ యింట్లో ఉన్నందు కామాత్రం సాయం చేయకపోతే యెట్లాగు?"

నేను శ్రీదేవితో మాట్లాడటం అదే మొదటిసారి. ఆకలితోఉన్న ఆడసింహంలా చూసింది నావంక. పైట సర్దుకుంది.........యింకా ఏమేమో.........ఇవన్నీ వనితాలోకానికి సహజమైనవి కాబట్టి నేను వాటికేమీ ప్రాముఖ్యత యివ్వను. మందస్మిత వదనార విందయై కోకిల కంఠంతో-

"రావుగారూ! మీరు గదిలో ఉన్నారా? లేరేమో అనుకున్నాను. మీతో మాట్లాడాలని చాలా రోజులనుంచి కుతూహలంగా వుంది. ఆ కాస్తభాగ్యం యిప్పుడు కలిగినందుకు చాలా సంతోషం."

"మీ కంటె వయసులో చిన్న వాణ్ణి అనుకుంటాను. అట్లాంటిది మీరు నన్ను 'గారని, ఏమండీ' అని సంభోదిస్తే నాకు చిన్నతనంగా వుంటుంది.-

"నేను మాత్రం యేమంత పెద్దను? మహావుంటే నాకిరవై యేళ్ళుంటాయి; మీకంటె రెండేళ్ళు పెద్దనేమో మీరు చెప్పిన ప్రకారం నువ్వుకూడా యికనుంచి నన్ను 'గారు, ఏమండి' అని పిలువవద్దు."

"అట్లాగే కానివ్వండి."

"అదుగో మళ్ళీ......?"

"పొరపాటు దానికేమి లెండి! ఇందాక తపాలా బంట్రోతు దగ్గర నుంచి ఉత్తర మెందుకు తీసుకో లేదు?"

"రావ్! దానికి పెద్దగాథ వుంది. అట్లాకూర్చో, అంతా సావకాశంగా చెబుతాను. మేమీ యింట్లో ప్రవేశించిన కొత్తలో కాలేజీలో చదువుకునే పిల్లలకి మా ఆయన యింట్లో క్రిందగది అద్దెకిచ్చారు. వాళ్లు కొంటె వెధవలు. ఎప్పుడూ యీలలు వేయడం, ఈతపళ్ళపాట పాడటం, సిగరెట్లు త్రాగటం- ఇల్లంతా నానా పాడూ చేశారు. 'శ్రీదేవి గారూ! కాసిని మంచినీళ్ళుయిస్తారా?' అని, రోజుకి యిరవైమార్లు అడిగే వాళ్ళు. చూడు, వాళ్లకి మంచినీళ్లివ్వడంవల్ల నా జబ్బలెట్లా కందిపోయాయొ"అని రవికకొన పైకెత్తి చూపించింది. లౌను తిరిగిన తెల్లటి భుజాలు చూసి ముగ్ధుణ్ణయి పోయాను.

"మా ఆయన యింట్లో యెక్కువ సేపుండరని నీకు తెలుసుకదా!"

"ఆదివారం తప్పితే మరెప్పుడూ నే నాయన్ని చూడలేదు"

"ఒకనాడేం జరిగిందనుకున్నావు?" అంటూ నాదగ్గిరిన జరిగింది; నేను కొంచెం పక్కకి తప్పుకున్నాను.

"మరేం పరవాలేదులే...... ప్రొద్దున పదకొండుగంటలైందేమో నేను నడవలో కూర్చుని విస్తరాకులు కుట్టుకుంటున్నాను. నాకు యింటిపని అంటె చాలాసరదా. ఆ కొంటెవెధవలు దారిలో కూర్చున్న నన్ను లెమ్మనలేదు సరికదా, రుసరుస నా కాళ్లుదాటి గదిలోకి వెళ్లారు"

"దారిలో యెందుకు కూర్చున్నావు?"

"నాకెప్పుడూ అది మామూల్లే. ఒంటరిదాన్ని; ఆయన లేనప్పుడు వికారచేష్ట లేమన్నా చేస్తారేమోనని-వాళ్లేమీ చెయ్యలేరన్న ధైర్యం మాత్రం నాకుంది-మా ఆయనతో చెప్పి వాళ్ళని వెళ్లగొట్టించాను. తరవాత రెండు నెలలవరకు మరెవ్వరిని ఆగదిలో చేరనివ్వలేదు. నేను చూడందె ఎవరికీ క్రిందగది యివ్వటానికి వీల్లేదని మా ఆయనతో గట్టిగా చెప్పాను. ఆనాడు నువ్వు వచ్చినపుడు, నిన్ను మేడమీంచి చూశాను. నువ్వుమాత్రం నన్ను చూడలేదు. ముఖలక్షణాలను బట్టి బుద్ధిమంతుడి వనుకున్నాను. నువ్వు గదిలో ప్రవేశించి నెలరోజులైనా నీతో నేనుగాని నాతో నువ్వుగాని మాట్లాడలేదు. మాఆయన నాతో, రావు చిన్నవాడు, 'ప్రపంచమంటే

యేమిటో తెలియదు. తల్లిదండ్రుల కోసం బెంగపెట్టుకుంటాడేమో, కాస్త జాగ్రత్తగా చూస్తూండ'ని పదేపదే చెప్పారు. కంటికి రెప్పవలె చూస్తానని భరవసా యిచ్చాను. ఇంతవరకు నీతో మాట్లాడలేదు గనుక నువ్వెట్లాంటి వాడివో నాకు బాగా తెలియదు. అందుకని ఉత్తరం తీసుకోలేదు. ఆ ఉత్తరం తీసుకోక పోవటంవల్ల ఒకళ్ళనొకళ్లు బాగా తెలుసుకోవడానికి మంచి అవకాశం యేర్పడ్డది. ఉత్తరం తీసుకోనందుకేమీ అనుకోబోకు; ఇకముందు నీకేది కావాలంటె అది చేసిపెడతాను."

శ్రీదేవి యెంత లోతైన మనిషి! ఎంత విశాల హృదయం!!

రోజులు గడిచినకొద్దీ శ్రీదేవికి నేనంటే చనువెక్కువైంది. నేనింట్లో ఉన్నంతసేపట్లో యేదోఒక మిష మీద నా కంట పడుతూండేది. నేను కాలేజీకి వెళ్లినప్పుడు నాగది శుభ్రంగా అమర్చిపెట్టేది. నేను సహజంగా అశ్రద్ధమనిషిని; యితరుల సహాయంలేకుండా నా వస్తువుల్ని నేను జాగ్రత్తచేసుకోలేను శ్రీదేవి పుణ్యమాఅంటూ నాకే లోటూ లేకుండా చేసింది. 'హోటలు తిండితిని దేహారోగ్యం చెడగొట్టుకుంటున్నావు; నీ భార్యని పట్నం తీసుకురా, లేదా మా యింట్లో అన్నం భోంచేస్తూండు' అనేది. నేనం చేయడానికైనా వొప్పుకునేవాణ్నికాని, వాళ్ళింట్లో భోజనం చేయడానికిమాత్రం యిష్టపడలేదు. అందుకని శ్రీదేవికి కోపం వచ్చిందని తోస్తుంది. అయితే ఆ అమ్మాయి కోపోపశమనానికి నేనేం చెయ్యగలను?

నేనొకసారి కాలేజీనుంచి యింటికొచ్చేసరికి నాగది తలుపు వోరవాకిలిగా వేసివున్నది. స్నేహితులు నాతో మాట్లాడవలసి వుంటె కాలేజీలోనే మాట్లాడేవాళ్లుగాని, నాగదికి వచ్చే అలవాటులేదు. పిల్లిలా వెళ్ళి తలుపు మెల్లిగా తోసేసరికి నాకో అపూర్వమైన దృశ్యం కనబడ్డది. చాలా అనుభవంవుండి, కవిహృదయాన్ని అనుసరించి చెప్పగలిగిన పాఠకులుగాని, రచయితనైన నేనుగాని దాన్ని ఊహించలేమని నానమ్మకం. అద్దానికెదురుగ నిల్చుని శ్రీదేవి టై వేసుకుంటోంది: మంచి పాప్లిన్ షర్టు నాదొకటి తొడుక్కున్నది, దానికి కాలర్ పెట్టింది; టై వేసుకునే ప్రయత్నం మీదున్నది. 'క్యూరియాసిటీ' కొద్దీ చిన్నపిల్లలు టై వేసుకోటం నేనూహించగలను, అర్థంచేసుకోగలను, యింకా వాటిని చూసి ఆనందించగలంకూడా! ఇరవై యేళ్ళు మీదపడి, ప్రౌఢత్వంతో ఉబికిపోతున్న శ్రీదేవి ఆ ప్రకారం చేయడం చూస్తే నా కాశ్చర్యమేసింది. శ్రీదేవి మానసికంగా చిన్నపిల్లేమోనని అప్పుడు నాకు తట్టింది. ఆ అమ్మాయి చేసేవాటిల్లో ముప్పాతిక మూడుపాళ్లు చిలిపిచేష్టలు, చీటికిమాటికి నవ్వు అంటూ వుంటుందిగాని, నిజానికా అమ్మాయికింకా చిన్నతనం పూర్తిగా వదలలేదు.

"శ్రీదేవీ!"

మగవాడల్లే గబగబా నడుస్తూ నాముందుకొచ్చి నిలుచుంది.

"రావు, అంతా చేతయిందిగాని టై ముడి మాత్రం పట్టుబడలేదు. కాస్త వేసిపెట్టవు?"

"ఆ మూడుముళ్ళు వెయ్యటం మగవాళ్ళకు చెల్లుగాని మీకు చేతనవుతుందా? నాకు తెలియక అడుగుతాను, ఈ హడావిడి యెందుకు శ్రీదేవీ!"

"నీకు తెలియలేదులే. నా హృదయం నీ విప్పటివరకు అర్థం చేసుకోలేదని స్పష్టమౌతుంది. నువ్వు రోజూ అద్దం ముందు నిల్చుని టై అతి చాకచక్యంతో వేసుకోవడం నేను చూస్తుండేదాన్ని. మా ఆయనట్లా వేసుకోగా చూసే భాగ్యం నాకు లేకపోయి నా- (శ్రీదేవి ముఖం దైన్యభావాన్ని ప్రకటించింది) నువ్వు వేసుకుని కాలేజీకి వెడుతూంటె చూడ నాకెంతో ముచ్చటగా వుండేది. అవే నేను వేసుకుని అద్దంలో చూసుకుంటె యెట్లా వుంటానో, నువ్వు చూసి ఏమంటావో అని వేసుకున్నాను. అయితే మరి 'టై' వేసి పెట్టవ్?"

"అట్లాగే."

వరహాలు మూటగట్టే నవ్వుతో నాకెదురుగ నిల్చుని "ఊం. కానియ్యి" అంది.

నాకునేను 'టై' వేసుకోగలను గాని, యితరులకు వెయ్యడం నాకు చేతకాదు. అయినా ఏదో తంటాలు పడ్డాను. ఆ వెధవ 'టై' కట్టడం చాల సేపు పుట్టింది లెండి!

"ఇంకా యెంతసేపు?"

"అంత తొందరపడితే పని జరుగుతుందా? అయిపోవచ్చిందిలే."

"ఇట్లాగైతే నా కొద్దుబాబు. ఇంత శ్రమ యెవరు పడుతారు? నన్నిక వొదిలిపెట్టు."

"పని సగంలో యెట్లా వొదులుతాను మరి? పూర్తి అయింది. "ఉండూ మరి, అయిపోవచ్చింది-" తర్వాత విడిచిపెట్టక నువ్వు పట్టుకోవున్నా పట్టుకుంటా ననుకున్నా నా?"

"నే నెట్లా ఉన్నాను? నీమాదిరి వున్నానా?"

"ప్రెశిడెంట్ పాత్ర ధరించిన కమలేశకుమారిలా గున్నావు. నీ ముందు నేనెంత? నువ్వు అమ్మాయి వైపోయినావుగాని, శ్రీదేవీ, నిన్ని డ్రెస్సులో ఏ అమ్మాయన్నా చూస్తే విడిచి పెడుతుందని తోచదు."

"నువ్వు కొంటెవాడ వవుతున్నావు!"

"నీదగ్గర నేర్చుకున్నదే! ఇంతకూ నేనేమీ యెఱుగను."

౪

నే నింటికి వచ్చినప్పుడల్లా శ్రీదేవి ప్రతి నిత్యంచేసే పనులను బట్టిచూస్తే ఆ అమ్మాయికి యింట్లో ఒక మగపురుగు ఉన్నాడనే స్పృహ కూడా లేనట్లు కనబడుతుంది. నా గది వెనకాలే వాళ్ల స్నానాలకొట్టు. నేను చదువుకునే సమయంలో కిటికీకెదురుగా స్నానంచేసేది. నాకు పరీక్షాసమయం వచ్చిందనుకుంటాను. నేనటు చూడనట్లు నటించేవాణ్ని. ఒకవేళ నేను కిటికీవేసినట్లయితే చాల గోల జరిగేది. చిత్రాంగి మాదిరి నామీ దేన్నో కొండేలుచెప్పి ఆయింట్లోంచి వెళ్ళగొట్టించేదని నా నమ్మకం. సత్ప్రవర్తన అంటె సారంగధరుడి తత్వ మనుకుంటారేమో పెద్దలు-అట్లాంటి దేమీకాదు. ఏదో పాపభీతి దైవభక్తిగలవాణ్ణని ముందే మనవి చేస్తున్నాను. ఆ అభివందనాలు విని నేను గర్వపడేవాణ్ణి. ఒకవేళ దెబ్బ బేజోసై నేను పప్పులో కాలువేస్తే చెడ్డవాణనేపేరు నాకు ఆ చంద్రతారార్కం నిలిచిపోయేది. శ్రీదేవి చేష్టలన్నీ ఒకకంటితో కనిపెడుతూండేవాడిని, అంతే! ఇంట్లో యెప్పుడూ రవిక తొడుక్కోకుండా తిరిగేది. ఇది బహుశ విశాఖపట్నం ఆ ప్రాంతాల వాళ్ల ఆచారమని తోస్తుంది. నేనిట్లా అనటంవల్ల విశాఖపట్నం మిత్రులకు కోపం రావచ్చును. అయితే వాళ్ళమనసు నొప్పించి, వాళ్లని అగౌరవ పరచాలని నా కేకోశమందూ లేదు. ఏదో జరిగిన దానినిగూర్చి వ్రాస్తున్నాను కాబట్టి యెవరూయేమీ అనుకోనా ప్రార్థన.

"రావు, నువ్వు తలంటి పోసుకుని యెన్నాళ్లయింది?"

"పదిరోజు లైందేమో!"

"మాయింట్లో ప్రవేశించిన తర్వాతనువ్వు తలంటు ప్రయత్నం చెయ్యగా నేనెప్పుడూ చూడలేదు. పోసేవాళ్ళెవరూ లేరని ఊరుకున్నావేమో-చెట్టంత మనిషిని నేనుండగా! ఇవాళ శనివారమేగా, నేను తలంటి పోస్తారా, ప్రతివారం తలంటి పోసుకోకపోతే వేడిచేస్తుంది. అసలు అర్భకుడివి, దానికితోడు తెల్లవార్లూ చదువుతావు. ఇట్లాగైతే నీమెదడు కరిగిపోతుంది. ఈ మాయదారి చదువు లొచ్చినప్పటి నుంచీ, కుర్రాళ్ళ శరీర సౌభాగ్యంలేక నాశనమై పోయినారు."

"వద్దు, శ్రీదేవి! నామాటవిను. ఎవరన్నావింటే ఏమంటారు? పరాయి స్త్రీవి, మగనాలివి, నువ్వు నాకు తలంటి పొయ్యడమేమిటి, పాపకర్మం కాకపోతే"

పాపం శ్రీదేవి నేనంటే యెంత ప్రేమ, యెంత వాత్సల్యం!

"పోస్తే తప్పేముంది? లోకు లేమనుకుంటే నాకేం? వాళ్ళ ఉద్దేశాలు నేనేమీ లెఖచేసేదాన్నికాను. నా అంతఃకరణానికి, నా భర్తకి నేను తప్పుచెయ్యడం లేదని తోస్తే అంతేచాలు! నాకు యితరుల భయ మెంతమాత్రం లేదు.

వద్దని బ్రతిమాలుకున్నా విన్నది కాదు. నేనేం చెయ్యడానికి విధిలేక వొప్పుకున్నాను. ఆ అమ్మాయి చేతుల్లో నేనొక ఆటవస్తువై పోయినాను. నా వొళ్లు నొప్పులు పెట్టేటట్లు రుద్ది, శుభ్రంగా తలంటి పోసింది. మా అమ్మగూడా నాకంత చక్కగా పోసినట్లు జ్ఞాపకం లేదు.

"నీ పెళ్ళికి నేనుంటె దంపతె గేసి తలంటి పోయించేదాన్ని. శరీరపోషణలేక పూర్తిగా చెడిపోయినావు. గట్టిగా గాలివేస్తే పడేటట్లున్న మీలాంటివాళ్ళు పెళ్లాలతో యేం కాపరంచేస్తారు. ఇప్పటి కాలపు యువకులతో పోల్చిచూస్తే, ముసలివాళ్ళే నయ మనిపిస్తారు. ఇప్పుడు ఆడపిల్లలుకూడా అంతంత మాత్రంగానే ఉన్నారులే మీఅమ్మ నీ శరీరపోషణని గూర్చి తగు జాగ్రత్త తీసుకున్నట్లు కనబడదు.

పోసీ నీ భార్యన్నా తీసుకుంటుందా అంటె ముక్కు పచ్చలారని పిల్ల, దానికేం తెలుసు? ఏమో నువ్వెంత అదృష్టవంతుడివి కాదేమో!"

"నిజమే."

నన్ను శ్రీదేవి చేసిన అగ్నిపరీక్ష లోంచి బయట పడేసరికి నాతల ప్రాణం తోకకి వచ్చింది.

※

నేనింటికొచ్చేసరికి బల్ల మీద ఒక వుత్తరం వుంది. తొందరగా దాన్ని విప్పి చూశాను.

(రాజమండ్రి)

"ప్రియమైన భర్త గారికి,-

మీరు ప్రేమతో వ్రాసిన ఉత్తరం అందింది. మీరు కోరిన ప్రకారం నేను పట్నం రావటానికి నా తల్లి దండ్రులు సమ్మతించారు. హోటలు తిండివల్ల మీ ఆరోగ్యం చెడుతుందని మా అమ్మకూ నాకూ భయంగా వుంది. అన్నయ్యా, నేను రేపు మెయిలో బయలుదేరి ఎల్లుండి ప్రొద్దున పట్నం చేరుకుంటాము. మీరు మమ్మల్ని స్టేషనులో కలుసుకోండి. వొంట్లో కులాసాగా వున్నందుకు చాల సంతోషం

నమస్కారాలతో—

—మీ కల్యాణి"

శ్రీదేవీ! కల్యాణి రేపు ప్రొద్దున వస్తోంది."

"భేష్. తొందరగా రావడం మంచిదైంది. నాకు కల్యాణిని చూడాలని చాలా కుతూహలంగా వుంది. నేను కూడా స్టేషనుకి రానా?"

"ఎందుకు? ఎట్లాగూ యింటికి వస్తుందిగా, ఏమంత తొందర?"

"నా తొందర నీకేం తెలుస్తుంది? మా చిన్న వొదిన ఊళ్లోకి వచ్చిందంటె చూడకుండా వుండగలనా?"

"మీ చిన్న వొదినెవరు?"

"కల్యాణే!"

"మంచి వరసే కలిపావు."

"ఇన్నాళ్ళనుంచి మరేమను కున్నావు?"

నాకు శ్రీదేవి తత్వం అప్పటికి పూర్తిగా బోధపడింది. ఆ అమ్మాయి వికార చేష్టలు కొన్ని చూసి ఏమేమో అనుకున్నాను. శ్రీదేవిని గురించి అప్పటివరకు నాకున్న దురభిప్రాయాలన్నీ ఒక్కసారి తుడిచి పెట్టుకుని పోయినాయి. నా మీదా, నా ఉద్దేశాలమీద పరమ అసహ్యం కలిగింది. నేనింత వరకు పరాయి స్త్రీని తాకిన పాపాన పోలేదు. తనకే కాకుండా లోకాన్నంతా సోదరీ మణులనుగా చేసింది శ్రీదేవి. ఇట్లాంటి ఉన్నత భావాలతో ఉయ్యాల లూగిపోయినాను.

ఎప్పుడు తెల్లవారుతుందా, యెప్పుడు కల్యాణిని చూస్తానా అనే ఆదుర్దాతో ఆ రోజంతా గడిపాను. నేను పెళ్లిలో చూశాను కల్యాణిని, మళ్లీ అప్పటివరకు చూడనే లేదు. నేను చూసినప్పుడు పన్నెండేళ్ల ముగ్ధ. నునుసిగ్గు తెరలతో మొహాన్ని సరిగా చూపించలేదు; నేను చూడలేక పోయాను. అందు చేత కల్యాణిని పెళ్లిలో చూసిన రూపు నా మన్సు పలకంలో నిలిచి పోయింది. మర్నాడు ప్రొద్దున శ్రీదేవి, నేను సెంట్రల్ స్టేషనుకి వెళ్లాము. మెయిలు పొరపాటున వేళకి వచ్చింది. పోర్టర్ల కేకలు, హోటలయ్యర్ల హడావిడి చెప్ప నలవి కాదు. నేను మూడవ తరగతి పెట్టెలు వెతికాను. ఎక్కడా కల్యాణి కనబడలేదు. ఇంజన్‌పక్క పెట్టె దగ్గరకు వెళ్లబోతూంటె యెవరో 'రావుగారు!' అని పిలిచారు. కంఠం యెక్కడో విన్నట్టుగానే వుంది. వెనక్కి తిరిగి చూస్తేనా బావమరది వెంకట్రావు-ప్రక్కన ఒకమ్మాయి కనబడ్డారు. కల్యాణిని చూసి ఆనవాలు పట్టలేక పోయాను. ఎంత మార్పు కలిగింది రూపంలో! ఉత్తరాల్లో ఆ పిల్ల ధోరణి, ప్రేమ, అన్నీ మునుపటి లాగే ఉన్నాయి.

"బావగారూ! మిమ్మల్ని ఆన వాలు పట్టలేక పోయాను. కల్యాణి గుర్తు పట్టింది."

"ఓహో. బాగానే వున్నది. చివరికి కల్యాణే గుర్తు పట్టవలసిన స్థితి వచ్చింది. ఎవరన్నా వచ్చి నేనే నీ బావనంటె నమ్మేవాడి వేమో?"

"ఒక వేళ నేను నమ్మినా, కల్యాణి వొప్పుకోవద్దూ."

"సెభాష్. భలే బావమరిదివి దొరికావు. మనకోసం శ్రీదేవి గారు కాచుకుని వున్నది, రండి యిక పోదాము."

కల్యాణిని చూసి సంతోషం పట్టలేక, శ్రీదేవి కావిలించుకుని చెక్కిలి ముద్దాడింది. కల్యాణి తెల్లబోయి వేడి కళ్లతో నావంక చూస్తూ నిలుచున్నది.

"అన్నయ్యా! ఎవరీ అమ్మాయి?"

"ఏమో, నాకు తెలియదు. యెవరో శ్రీదేవి గారన్నాడు- బావ బహుశ- ఆవిడేమో!"

వెంకట్రావు వొట్టి సన్యాసి. వాడికేమీ తెలియదు. ముప్పొద్దుల భోజనం చేసి రోజంతా పెళ్లాం ముందు కూర్చుని గోంగూరకబుర్లు చెప్తూంటాడని కల్యాణి నాకో సారి వ్రాసినట్లు జ్ఞాపకం. శ్రీదేవిని కల్యాణి కెఱుకపరిచాను. అప్పటితో యిద్దరికి స్నేహం కలిసింది. కారులో శ్రీదేవి కల్యాణి ఒకటేమాటలు. ఇంతత్వరలో స్నేహం కలిపినందుకు శ్రీదేవి నభినందించాలో, లేక కల్యాణినే అభినందించాలో నాకు తెలియదు. ఇద్దరికి యేదో జన్మాంతర సంబంధంవున్న దనుకున్నాను. మరి శ్రీదేవికి చిన్నవాదినంటె అంత ప్రేమ!

౬

కల్యాణి మెద్రాసు వచ్చినప్పటి నుంచీ నా జీవితంలో నూతన శకం ఆరంభమైంది. శీతారామయ్యగారు నాతో నాగులు ముక్కలు మాట్లాడటాని కదే మొదటిసారి.

"ఇదుగో రావు, నీభార్యకూడా వచ్చిందా, చిన్నవాళ్ళు మీరు మేడమీద గదిలోవుండండి. మేము క్రింద వుంటాము. మీరు సుఖపడుతుంటె చూసి ఆనందించవలసిన వాళ్లమేగాని- మా పని అంతా అయిపోయింది. కల్యాణి చిన్నపిల్ల, వంట చెయ్యటం చేతకాదేమో శ్రీదేవి కావలసిన సాయంచేస్తూంటుందిలే- సాధ్యమైనంతవరకా పిల్లనేమీ కష్టపడనీయద్దు, తెలిసిందా?"

"ఆ, పది రోజుల్లో మా అమ్మ వస్తుంది లెండి. పెద్దలు మీరు అండగా వుండటం మా అదృష్టమే శ్రీదేవిగారు మా విషయమై చాల జాగ్రత్త తీసుకుంటున్నారు. అంతా మీ బలవే!"

కొద్ది రోజుల్లోనే కల్యాణి శ్రీదేవులు జీవికా జీవులై పోయినారు. ప్రతి పనిలోను కల్యాణికి శ్రీదేవి తోడు పడేది. కల్యాణి సుకుమార సుందర దేహమెక్కడ అలసి పోతుందోనని యివతల పుల్ల తీసి అవతల పెట్టనిచ్చేది కాదు. నిజానికి శ్రీదేవి రెండు సంసారాలు చక్కపెట్టిందని చెప్పాలి. దినానికి రెండుసార్లు కల్యాణికి జడవేసేది; ప్రతివారం తలంటి పోసేది; రోజుకి కనీసం పదిగంటలన్నా మేడమీద గడిపేది. పెద్దదిక్కు లేదన్న కొరతేమీ లేకుండా చేసింది. కావలసిన బంధువులు సహితం ఆవిధంగా చేయూతనిచ్చేవారు కారని నా దృఢ విశ్వాసం.

మా అమ్మ కూడా వచ్చింది.

"ఒరే నాయనా, శ్రీదేవి మీ యిద్దరిమీద నాతో ఫిర్యాదు చేసింది. కొత్త సంసార మవటంవల్ల, యెట్లా చేసుకోవాలో తెలియదని, నెయ్యి మొదలైనవి చాలా వృథా చేస్తున్నారని. మీరన్నా పైనుండి సంసారం చక్కగా దిద్దాలని అంది నాతో. చిన్నవాళ్లు అనుభవంమీద పొదుపు నేర్చుకుంటారిక అని నచ్చ చెప్పాను. నేనువచ్చి రెండురోజులైన తర్వాత నాతో, 'కల్యాణే నయ మనిపించిందండోయి, మీది మరీ జారీచెయ్యి. ఏకాడికైనా అత్తకంటె కోడలే మెరుగంది"

"పాపం, శ్రీదేవికి మాలో యెంత యింటరెస్టు!"

* * *

శీతారామయ్యగారికి శ్రీదేవికి గర్షణ జరగటం చాల అపరూపం. శ్రీదేవి గట్టిగా మాట్లాడుతోంది. సామాన్యంగా నాతో మినహా- యెవరితో అంత జబర్దస్తీగా మాట్లాడదు.

"నన్నెందుకిట్లా బాధపెడతావు? నాకు తోచిందేదో పట్టుకొచ్చాను. అద్దం యెట్లావుంటేనేం? దీనికేం రోగమా? మనకు కావలసిందల్లా ముఖం కనబడటమే! చక్కగా అద్దంలావుంది నే పట్టుకొచ్చిన అద్దం"

"అబ్బ, మీరు పూర్వకాలం మనుషులండీ, చూడండి మొన్న రావు కల్యాణికోసమో అద్దం పట్టుకొచ్చాడు. ఎంత బాగుందనుకున్నారు? నే నెప్పుడు చూడలేదట్లాంటి అద్దం. మీరుకూడా అట్లాంటిదే తీసుకొస్తారని నే నాశించాను."

"ఇంట్లో వొంట్లో శక్తివున్నవాడతను. పైగా కొత్తకాపరం, పైలా పచ్చీసులో ఉన్నారు. అన్నీ వుడిగి మనంవున్నాం. మనం యిప్పుడు చేయ గలిగిందల్లా, వేళకి నాలుగు మెతుకులు తిని రామనామ స్మరణ చేయడం. యితరులు సుఖపడుతూంటె చూసి సంతోషించడమున్నా. ఇంకా యెన్నాళ్ళ సంసార తాపత్రయం? మనకి నానాటికి యేళ్లు మీద పడుతున్నాయేగాని, క్రిందపడటం ల్లేదుగదా!"

"మీకు పడుతున్నాయేమో, నేను మాత్రం చిన్నదాన్నే! ఇతర సంగతుల్లో యెట్లావున్నా, మంచి అద్దమన్నా తెచ్చి పెట్టలేర టండీ? పోనీ మీకు తెలియకపోతే యెక్కడకొన్నాడో అతన్నడిగి తెలుసుకో వచ్చునుగా; పెళ్ళాని కేదన్నా తీసుకురావడానికి బద్ధకమైతే, అతన్ని బ్రతిమాలుకుంటె అతనే తెచ్చి పెడతాడు. మన యింట్లో యిన్నాళ్ళున్నందుకా మాత్రం చెయ్యడా యేమిటి?"

"ఆహా. ఆచిన్నపనే కాదు. మీ ఆజ్ఞ ఇక్ ఏపని చెయ్యమంటె అది చేస్తాను" అంటూ సంస్కృత నాటకాల్లోని నాయకుడిలా రంగంకిలో ప్రవేశించాను.

"చూశావు రావు, ఎట్లాంటి అద్దం పట్టుకొచ్చారో మా ఆయన? ఏమన్నా అంటె విరక్తిమీద గంభీరోపన్యాసం యిస్తారు. ఈ అద్దాన్ని ప్రత్యేకం మా ఆయన కోసమే తయారు చేశారుట. ఈ అద్దాన్నిచూడు."

శ్రీదేవి మాటలు విని కిక్కురు మనలేదా మానవుడు. సత్య కాలం మనిషి! కలియుగంలో శీతా రామయ్యగారి లాంటి వాళ్ళని రాచిరంపాన పెడతారు. ఆయన అదృష్టవశాత్తు శ్రీదేవి, పాపభీతికి లోకభీతికి వెరచి అంత పనిచెయ్యటం ల్లేదు. అదే యేచదువుకున్న నవ నాగరిక సుందరీమణో అయితే యికచెప్పారు ఆయన అవస్థ?

అద్దాన్ని నఖశిఖ పర్యంతం పరీక్ష చేశాను. దాంట్లో ప్రతిబింబం సరిగా కనబడటల్లేదు.

"శీతారామయ్యగారు! అద్దమేమి బాగుండలేదండి. శ్రీదేవిగారి మొహంమీద మచ్చలున్నాయని మీకు తెలుసుగా. ఈ అద్దంలో ఆ మచ్చలు మరీ పెద్దవిగా కనబడుతున్నాయి. మంచి అద్దం మచ్చల్ని తక్కువన్నా చెయ్యాలి, లేదా మచ్చలు కనబడీ కనబడకుండా చెయ్యాలి."

చమత్కారంగా నేనన్నమాటలకి శ్రీదేవి నావంక గుడ్లురిమి చూసింది. ఆ అమ్మాయి ఉద్దేశాన్ని బాగా అర్థంచేసుకో గలిగాను.

* * *

మొన్నసీమధ్య నారీ హృదయాన్ని గురించి ఒక కవి కుమారుడు ఊకదం చేస్తున్నాడు. అప్పుడు నాకు శ్రీదేవి జ్ఞాపకానికి వచ్చింది; ఆ అమ్మాయి చర్యలు నాకు కళ్లకు కట్టినట్లున్నాయి. శ్రీదేవి తత్వం నాకిప్పటివరకు పూర్తిగాబోధ పడలేదనవచ్చు. ఒకొకప్పుడు శ్రీదేవి నామీద ప్రేమ ఉన్నట్లు కనబరిచేది; మరుక్షణం దాన్ని భాతృవాత్సల్యంగా మార్చేసేది. దగ్గరకు రమ్మని పిలిచేది- రానిచ్చేది గూడా అంతే! పూర్వకవులంతా స్త్రీ హృదయం మీద అంతులేకుండా పేజీలు పాడు చేసి తేల్చిందేమంటె, వాళ్ళంతా కామినులని, వాళ్ళకి నగలపిచ్చి, చీరెలపిచ్చి కద్దని, మీదు మిక్కిలి దురభిమానం వున్నవాళ్లనీ తేల్చారు. ఎంత వెదికినా శ్రీదేవిలో ఈ లక్షణాలు కనబడలేదు. బహుశః వాళ్ళ శక్తి సామర్థ్యాల కతీతమైందేమో శ్రీదేవి! మానవులకి సహజంగా వుండే మానసిక దౌర్బల్యంచేత నేనేమన్నా సందు యిస్తే కొంప మునిగేది. నా మంచితనమే శ్రీదేవి శీలాన్ని, మానాన్ని కాపాడిందని నేను ముమ్మాటికీ నమ్ముతాను. అందుకే నేనంటె శ్రీదేవి కంతగురి; చిన్నవాడినంటె అంత ప్రేమ! అట్లా కాక వేరువిధంగా ఐతే నేను మామూలు మనుషుల మాదిరి నిక్షేపంలాంటి సంసారాన్ని పాడుచేసి ఆపుణ్యం కట్టుకునేవాడిని. అయితే నేనట్లా అనటానికి భగవదేచ్ఛలేదు.

శ్రీదేవి నేటికిగూడా నాకొక సమస్యగానే వున్నది!

[వ. రా. ఈ వ్యాసానికి కథాలక్షణా లెక్కడలేవని నాకు తెలుసు. దానికి కారణంకథా వస్తువే, జరిగిన సంగతులు. తు, చ, తప్పకుండా వ్రాయటంవల్ల వచ్చిందీ పెద్దకొరత. ఈ విలక్షణాన్ని పాఠకులు మన్నింతురుగాక!]